కాలిఫోర్నియ తెలుగు సమితి

# తెలుగు వాణి

స్వర్ణలోయలో తెలుగు వెలుగు

2012

సంపుటి : 1

సంచిక : 1

పుట : 1




## ముందు మాట

మహానుభావులు రాయప్రోలు వారు యెప్పుడో అన్నారు "ఏ దేశమేగిన ఎందు కాలిడినా ఏ పీఠ **మెక్కిన ఎవ్వరేమనిన పొగడ రా నీ తల్లి భూమి భారతిని అని**". విశాలాంధ్రోదయానికి ముందే శంకరంబాడి గారు "**మా తెలుగు తల్లికి మల్లెపూదండ మా కన్న తల్లి కి మంగళారతులు** " అంటూ ఈ తెలుగు తల్లి కీర్తి "**నిత్యమై నిఖిలమై నిలిచియుండాలని, ఆతల్లి పాటనే పాడుదాం ఆతల్లి మాటలే ఆడుదాం** " అని జాగృతీ గీతాన్ని ఆలపించారు. ఎప్పుడో అన్న ఆ మాటలు ఇప్పుడు ఆచరణలోకి వచ్చాయి. అందులో భాగంగానే తెలుగు

---

భాష ప్రాతిపదికగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఎన్నో తెలుగు సమాఖ్యలు ఏర్పడ్డాయి. మన నగరంలో కూడా అటువంటి సత్సంఘటనే జరిగి "**కాలిఫోర్నియ తెలుగు సమితి** " ఏర్పడింది.

మన ఈసమితి బుల్లి బుల్లి నడకలు నేర్చుకొంటూ, ఈప్రాంతములోని తెలుగువారందరిని సంఘటితం చేయాలనే సంకల్పంతో ఒక ప్రారంభ నివేదికను తయారు చేసికొని , మున్ముందు కార్యక్రమాలకు ఒక ముసాయిదాను ఏర్పాటు చేసికోవడం కోసం ప్రయత్నాలు జరుపుతుంది. ఇచ్చట వున్న మీకు తెలియదని కాదు, కాని తెలియజేయాలనే ఆకాంక్షతో మన తెలుగు ప్రాశస్త్యం గురించి కొంచెం ముచ్చటించుకోవడం అప్రస్తుతం కాదని మా ఆలోచన.

ఆంధ్రమహావిష్ణువు స్వప్నంలో ఇచ్చిన ప్రోత్సాహం మేరకు, ఆముక్తమాల్యద రచన ప్రారంభంలో శ్రీకృష్ణదేవరాయలు చెప్పిన ఈ పద్యం చూడండి.
"**తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను,**
**తెలుగువల్లభుండ తెలుగొకండ, ఎల్లనృపులుగొలువ**
**నెరుగవే బాసాడి, దేశభాషలందు తెలుగు లెస్స**"
అలాగే, తెలుగుదనము వంటి తీయదనము లేదు
తెలుగు కవులవంటి ఘనులు లేరు, తెలుగుతల్లి సాధు
జన కల్పవల్లిరా, లలిత సుగుణ జాల తెలుగు బాల,
అని మరొక కవి ఆణి ముత్యాల్ని వ్రాశారు. ఇక "**చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా గతమెంతో ఘనకీర్తి గలవోడా**" అంటూ వేములపల్లి శ్రీకృష్ణ గారు ఒక మేలుకొల్పు గీతాన్ని ఆలపించి నిద్రాణమయిన తెలుగు జాతిని మేలుకొల్పారు.

" ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర" అనే సాహిత్య విమర్శనా గ్రంధంలోని కొన్ని మాటలు మన తెలుగు వారి ఔన్నత్యాన్ని ఎలా చాటాయో చూడండి.
ఆంధ్రులకు అంటే తెలుగు మాట్లాడే ప్రజలకు చాలా ప్రాచీనమయిన చరిత్ర వుండడమే కాక, ప్రత్యేకమయిన సంస్కృతీ సాహిత్య పరంపరలు వేయి సంవత్సరాలుగా వున్నవి. సంగీతం, నాట్యం, చిత్రకళ, శిల్పకళల్లో ప్రత్యేక బాణీలు సంతరించుకొన్న జాతి ఆంధ్రజాతి.

తెలుగునాడు ఉత్తర దక్షిణ భారతాలకు కూడలియై, రెండు ప్రాంతాలకు వారధిగ ఉండడం వల్ల ఆర్య సంస్కృతిలోని మేలు గ్రహించి, తెలుగు సంస్కృతిని ఆర్య-అనార్య సమ్మిశ్రమం చేసింది. ద్రావిడ సంస్కృతాల మిళితమై సాహిత్య భాషగా వికాసం చెందింది.

తెలుగు భాష సంగీతానికి అనువైన భాష. సంగీత నాదాలను వెలువర్చే శక్తి తెలుగు అచ్చులకు హెచ్చుగా వున్నది. కాబట్టి తెలుగు భాష తక్కిన భాషలకంటె, సంగీతానికి అనువైన భాష. మన శిల్ప కళ శాతవాహనుల కాలంలో ఇండోనేషియా వరకు వ్యాపించింది. మన చిత్రలేఖనం అజంతాగుహల్లో గూడా వుండడం మరో విశేషం. అభినయంలో ప్రధానమైన కూచిపూడి నాట్యం తెలుగువారిదే.

ఆంధ్రజాతి జాత్యభిమానంగల జాతి. అందుకే అందరికన్నా ముందుగా భాషాపరంగా ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడి 1956 లో విశాలాంధ్రను సాధించింది. ఇక, ఈ జాత్యభిమానమే తెలుగువాని స్వాభిమానంగా మారి ఒక ప్రాంతీయ రాజకీయ పార్టీ ఏర్పడడం, కొద్ది మాసాల్లోనే ఒక ప్రభంజననంగా మారి రాజకీయాల్లో

---

పెనుమార్పులు తీసుకొచ్చి దేశానికే ఒక క్రొత్త ఒరవడి ఇవ్వడం మనందరికి తెలిసిందే. ఇట్టి చరిత్ర వున్న మనం ఒకటిగ సంఘటితం అయి ఒక సాంస్కృతిక సమాఖ్య (సమితి) ఏర్పరచుకోవడం ఏంతో ముదావహం. మన కాలిఫొర్నియ తెలుగు సమితి ముఖ్యోద్దేశాలు యివి :

1. తెలుగు భాషాభివృద్ధి
2. తెలుగు సమాజంలో విద్య, సాంఘిక, మరియు సాంస్కృతికాభివృద్ధి
3. తెలుగు కుటుంబాల సంఘీభావం
4. మాతృభూమికి సేవ

వీటిని సాధించడం మీ అందరి ఆదరాభిమానాలు, సహాయ సహకారాలు వుంటేనే జరుగుతుంది. అనతి కాలంలోనే సమితి సభ్యులనుండి యితరసమాలోచనాపరుల నుండి సాంఘిక, సాంస్కృతిక, విషయాలపై ఇంటర్నెట్ మీడియం గా చర్చలు వచ్చాయి. అందులో ముఖ్యంగా ఈ క్రిందివి చెప్పుకోదగ్గవి.

1. పౌరాణిక, సాహిత్య, మరియు తెలుగు భాషలపై చర్చ
2. సమకాలీన సాంఘిక పరిస్థితులు వాటి విశ్లేషణ
3. తెలుగు సాంస్కృతీ సాంప్రదాయలపై చర్చ

ఇటువంటి మంచి విషయాలపై చర్చించుకోవడం కోసం ఈ సమితి యొక్క " వెబ్ సైట్ " వేదికగా మారడం, ఎంతోమంది ఆలోచనాపరులను ఉద్దీపనం చేయడం చాలా సంతోషమయిన విషయం. ఇటువంటి ఎన్నో విషయాలపై యిలాంటి 'మేధోమథనం ' (Brainstorm) జరగడం వల్ల మనందరిలో ఒక మేలయిన ఆలోచనా సరళి వస్తుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి గాని, అపోహ గాని లేదు.

ఈ ' మేధోమథనం ' ఇంటర్నెట్ కే పరిమితంచేయకుండా ఒక చిన్న గృహసంబంధమైన (In-house) పత్రికలాంటి దానిని గూడా ఒక వేదికగా చేస్తే బాగుంటుందనీ, అందులో అందరూ పాల్గోవడానికి వీలవుతుందని "**తెలుగు వాణి**" అనే పత్రిక నొక దానిని ఈ సమితి నిర్వహించడానికి ప్రయత్నిస్తోంది. ప్రప్రధమమయిన పత్రికా రూపం మీ చేతుల్లో వున్న చిన్న పత్రం. దీనిని ఎన్నాళ్ళకొక సారి ప్రచురించాలి, ఎటువంటి శీర్షికలు ఉండాలి అన్న విషయాలు సభ్యుల, పాఠకుల సలహాల మేరకు పత్రిక సంపాదక మండలి నిర్ణయిస్తుంది. సలహాలే కాకుండా రచనలు పంపడం దీనికి పుష్టినిస్తుంది. దీనిలో పాల్గొనడానికి అందరూ అర్హులే. మీలో నిద్రాణంగా వున్న ప్రతిభా పాటవాలకు బహిర్గతం చేసి, సంఘానికి మేలు చేయండి. సద్విమర్శలు పంపండి.

ముందుగా ఈ పత్రికలో యువతకు, విద్యార్థులకు, స్త్రీలకు, తెలుగు నేర్చుకొనగోరే యిచ్చటి ప్రవాసాంధ్రులకు (Non-Resident Andhraites)

వివిధాంశాలుంటే బాగుంటుందని సంపాదకవర్గ ఆలోచన. కాని దిశానిర్దేశనం (Direction / Orientation), రూపురేఖలు మీరుగూడా తెలుపవచ్చు. మీ ఆలోచనలు మాకు మార్గదర్శకం కావచ్చుగదా !

మీ రచనలు, సద్విమర్శలు మన మేధస్సు యొక్క అంచులను పెంచ గలిగితే, సంఘంలో ఒక మంచిని సాధించగలిగితే ఆందరికి ఆనందాన్ని యివ్వగలిగితే అంతకంటే మనందరికి కావల్సింది ఏముంది? మేము ఆశించేదీ అదే.

అందరూ ముందుకు రండి, ఆనందాన్ని పంచండి, మంచి అనుభూతుల్ని నింపండి, తెలుగు సమాజాన్ని ముందుకు నడపండి.

### మీ రచనల కోసము మా హృదయపూర్వక అహ్వానము

చిన్నలారా పెద్దలారా
అందుకోండి
కాలిఫోర్నియా తెలుగు సమితి
వారి ఆహ్వానం

కవులారా కవయిత్రులారా
తెలుగు భాషా ప్రేమికులారా

మేలుకొలపండి
మీలో దాగివున్న భావుకతని

పట్టండి తెలుగు భాషా కుంచ
గీయండొక కవితా రేఖ
అల్లండొక కథానిక
చెప్పండొక ముచ్చట
వ్రాయండొక వ్యాసం
పేల్చండొక నవ్వుల టపాసు
విసరండొక సవాలు
విప్పండొక పొడుపుకథ
అడగండొక యక్ష ప్రశ్న

సమయాభావం కాకుండా కలం పట్టండి
తెలుగులో నాలుగు మాటలు వ్రాయండి
మీదైన బాణిలో తెలుగువాణిలో
మీ ప్రతిభని ప్రదర్శించండి
తెలుగు కళల్ని పోషించండి
తెలుగు భాషా సంస్కృతుల్ని
ప్రపంచం నలుదిశలా చాటండి.

**తేనె కన్న తియ్యనిది తెలుగు భాష. తెలుగులో మాట్లాడండి. తెలుగువారి మని గర్వపడండి.**

## సంపాదక వర్గం

శ్రీదేవి రావి | మైలవరపు సాయికృష్ణ
రమామణి ఆకెళ్ళ | కుమార్ కలగర

## ఆనంద 'నందన'ం

సన్యాసి

ఉగాది, యుగాది, సంవత్సరాది అని రక రకాల పేర్లతో మనమందరం ఖరనామ సంవత్సరానికి స్వస్తి చెబుతూ నందన నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాం. చాంద్రమానం లో ప్రభవ దగ్గరనించి అక్షయ నామ సంవత్సరం దాకా అరవై ఏళ్ళూ తిరుగుతూనే ఉంటాయి. అంటే ఏమిటి ?, దీన్ని తర్వాత వివరిస్తాను.

"ఉగాది" అనగానే మనకి మన సంప్రదాయ బద్ధమైన పండగే గుర్తుకి వస్తుంది. ముఖ్యంగా, ద్వారాలకు లేత మామిడాకుల తోరణాలు కట్టడం,పొద్దున్నే నూనెతో తలంటి నలుగు పెట్టిన స్నానాలూ, కొత్త బట్టలు కట్టుకోడం, ఉగాది పచ్చడి,పోలిపూర్ణం బూరెలూ, చద్ది అన్నం, బొబ్బట్లూ, పంచాంగ శ్రవణాలూ, కవితా గోష్ఠులూ, సంగీత కచ్చేరీలూ, ఈ సమస్తమూ గుర్తుకి వస్తాయి. ముఖ్యంగా నాలాటి వృద్ధులకు మరీను .

ఇంక ఉగాది పచ్చడి గురించి ఎన్నో అర్థాలూ, విశ్లేషణలూ చెప్పుకుంటూ ఉంటాం. ఆ పచ్చడిలోని వేప చేదు, దుఖానికీ , బెల్లం తీపి సుఖానికీ, పచ్చిమిరప క్రోధానికీ, చిగురు మామిడి ఆశకీ ( ఆశ్చర్యానికీ ) పులుపు జుగుప్సకీ ( ఏవగింపు ) పసుపు శ్రేయస్సుకీ ఇలా అర్థాలు చెప్పుకుటూ పోతారు పెద్దలు. కానీ దీంట్లో అంతరార్థం ఏమిటంటే, మనలోనే ఆంతర్యంగా ఉన్న ఆ షడ్రిపులను, అంటే కామ, క్రోధ,లోభ,మోహ,మద, మాత్సర్యాలను, అంతే కాదు ఆ షడూర్ములను, కలిపి తినేయమని అంటే జయించమని, అంటే నిర్మూలించమని సంకేతం. ఆంతే గాని ఏదో లాంఛనంగా లౌకికంగా, ఆరగించమని కాదు.

ప్రతీ ఏడూ ఉగాది చైత్ర శుక్ల ( శుద్ధ ) పాడ్యమి తో ప్రారంభం అవుతుంది. వసంతానికి స్వాగతం పలుకుతున్నదన్న మాట. వసంత ఋతువులో మన చుట్టూ వున్న భూమీ, చెట్టూ,చేమా సమస్తం పచ్చదనాన్ని సంతరిచుకుంటాయి. పాడీ, పంటా సమృద్ధిగా పండుతాయి. అది మనకి ఆహ్లాదకరం, ఆనంద దాయకం కూడా. " ఆనందో బ్రహ్మణో విద్వాన్ " ఆనందమే బ్రహ్మ తత్వమని తెలుసుకో మని తైత్తిరీయోపనిషత్తు ఘోషిస్తున్నది.

ఇక పోతే, కృష్ణ దేవరాయలు గడిచి అయిదు శతాబ్దాలు గడిచేయి. ఆయన ఆస్థానంలో అష్టదిగ్గజాల్లో ఒకడైన పింగళి సూరన్న రాఘవ పాండవీయంలో ఈ వసంత ఋతువు రాకడ గురించి వర్ణిస్తూ ఒక చక్కటి పద్యం దానికి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి వ్యాఖ్యానం కింద పొందుపరుస్తున్నాను. దీంట్లో రమణీయత మీకే తెలుస్తుంది.

> అంత వసంత మొప్పె జరమాగ్రిమ భాగ చరాఖిలర్తు సా
> మంత, మనంత జాలక సమంజస రంజిత కుంజ కుంజరో
> ద్వాంత నితాంత సాంద్ర మధు దాన విజృంభిత బంభర స్వనా
> త్యంత నిరంతరీకృత దిగంత, మతాంత లతాంత కుంతమై

---

ముందూ వెనకా నడుస్తున్న మిగతా ఋతువులు వసంతానికి సామంతులట. అనంతమైనమొగ్గలతో రంజిల్లే లతాకుంజాలే (పొదరిళ్ళు) కుంజరాలుట (ఏనుగులు). ఆ పూలపొదరిళ్ళ నుంచి స్రవిస్తున్న మకరందం అనే మదజలాన్ని తాగి విజృంభించిన తుమ్మెదల (బంభరాల) ఝుంకారధ్వనులతో దిగంతాలు క్రిక్కిరిసి (నిరంతరీకృత) పిక్కటిల్లి పోతున్నాయట. లతాంతం అనే కుంతాన్ని (పువ్వు అనే ఆయుధం) ధరించిన మన్మధుడు అలసట అనేది లేకుండా సంచరిస్తున్నాడట. ఇంత అందమైన భావాన్ని ఇంత అందమైన కూర్పుతో, వినడానికీ అనడానికీ కనడానికీ అనువుగా అందించగలిగాడు సూరన్న. తెలుగు సాహిత్యంలో ఇటివంటి పద్యం మరొకటి లేదు.

శిశిరం నించి వసంతంకి , వళ్ళు కొరికే చలి నించి ఆహ్లాదకరమైన సూర్యకాంతికి మార్పు కోసం, తోటల్లో పక్షుల కిలకిలారవాలకీ మనం ఎదురు చూస్తాం. ఈ మార్పుల కోసం ఎదురు చూడడం మానవ నైజం. కానీ ఈ మార్పులన్నింటినీ నిర్దేశించి, నడుపుతున్న ఆ అవ్యక్తమూర్తి, ఆ సర్వాంతర్యామిని, ఆ పరమాత్మని గమనించం. అంతే కాదు, వీటినన్నిటినీ గమనించే మనలోని అంతరాత్మనీ గమనించం. అదే మన దురదృష్టం.

నందన వనం దేవేంద్రుడి ఉద్యానవనానికి పేరు. దేవేంద్రుడు ఇంద్రియాలకు అధిపతి. అంటే, మన ఇంద్రియాలకు మనమే దేవేంద్రులం. ఈ ఇంద్రియాలనే అదుపులో పెట్టుకోమని ఉగాది పచ్చడి హెచ్చరిక. అప్పుడే మనకి ఆనంద ప్రాప్తి, ఆనంద నందనవనంలో విహరించే అర్హతా దక్కుతాయి.

**శుభం భూయాత్.....**

=============

## ఉగాది పండుగ ప్రాశస్త్యం నందన ఉగాది

డా!! మాడ్గుల ఆది నారాయణ శాస్త్రి

ఉగాది లేక సంవత్సరాది మనకు అతి ప్రధానమైన పండుగ. ముఖ్యంగా తెలుగు వారికి చాలా ఇష్టమైనది. ఉగాదిని యుగాది గా యుగ + ఆది గా కొందరు అభివర్ణిస్తారు. తెలుగు సంవత్సరానికి మొదటి రోజు కాబట్టి 'సంవత్సరాది' గా చెబుతున్నాము. ఆంగ్ల వ్యావహారికం లో జనవరి 1 వ తేదీని ప్రపంచమంతా ఎట్లా జరుపుకుంటుందో, భారతదేశంలో దాదాపు దక్షిణాది తెలుగువారు ఏయేదేశాల్లో వున్నా ఆయా దేశాల్లో స్థానిక కాలమానం, ఆయా వారాంతపు రోజుల్లో అనుకులాన్ని బట్టి జరుపుకుంటున్నారు.

'ప్రభవ' సంవత్సరం నుండి 'అక్షయ ' సంవత్సరం వరకు తెలుగులో సంవత్సరాలు అరవై. ఇవి పునరావృతమై వస్తూనే వుంటాయి. ప్రస్తుతం శ్రీ 'ఖర' నామ సంవత్సరం గడిచి, 'నందన' నామ సంవత్సరం 23-03-2012 శుక్రవారంనాడు వచ్చింది. అంటే చైత్ర

మాసం శుక్ల పాడ్యమి తిధితో తెలుగు నూతన సంవత్సరాదిగా ప్రారంభింపబడింది. అలాగే సంప్రదాయంగా వస్తూంది.

తెలుగువారికి ఉగాది, వినాయక చవితి, విజయ దశమి, దీపావళి, సంక్రాంతి ప్రధానమైన పండుగలు. వీటిలో ఆయా పండుగులకు ఆయా సమయాల్లో ప్రత్యేక స్థానమున్నా, సంవత్సరప్రారంభం లో వచ్చే 'ఉగాది' కి మరింత ఉత్కృష్ట స్థానముంది అని అనుటలో అతిశయోక్తి యేమాత్రమూ లేదు. ఎందుకంటే ఈ రోజు ఎక్కడెక్కడో వున్న కుటుంబ సభ్యులంతా ఒక చోట చేరి, ఉదయాన్నే అభ్యంగస్నానాది కృత్యాలాచరించి, నూతన వస్త్రాలు ధరించి దైవ పూజ చేసి, షడ్రుచులతో కూడిన తీరర్థమును దైవ ప్రసాదంగా స్వీకరించి సంతోషంగా, ఇంటిల్లిపాదీ, పిండివంటలు చేసుకొని, ఆరగించి, రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా వుంటూ, ఆట పాటలలో, పిల్లల ఆనందాల హరివిల్లుల్లో సంతోషంగా గడుపుతారు. ఈ రోజు ఆనందంగా వుంటే, ఈ సంవత్సరమంతా అట్లాగే వుంటారని పెద్దలు పూర్వం నుండీ మనకు చెబుతున్నారు.ఇది ఒక సంప్రదాయం. ప్రాచీన కాలం నుండి వస్తున్నదే. ఈ సందర్భంగా మనం ఇక్కడ ఉగాది పచ్చడి (తీర్థ ప్రసాదాలు) ని గురించి కొంత చెప్పుకోవాలి.

వేపపూత, మామిడికాయముక్కలు, కొత్త బెల్లం, పచ్చిమిరప, సైంధవలవణం, కొత్త చింతపండు పులుసులతో కలసిన షడ్రుచుల పదార్థాలతో దేవతానివేదనం చేసి, పూజలు చేసి, మంగళహారతులు అనంతరం భక్తితో అందరూ ప్రణామాలు చేసి ఈ తీర్థప్రసాదాలను సేవించాలి.

ఆరు ఋతువులూ (12 మాసములు, ఉత్తరాయణం, దక్షిణాయనం అనబడే రెండు ఆయనాములు), తిధి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనబడే పంచాగములు ప్రతి సంవత్సరాదిని మాత్రమే కాక, సంవత్సరమంతా పాటింపదగిన కనీస నియమాలుగా తెలుగు వారి కాల నిర్ణయ పట్టికగా, సంప్రదాయ ప్రణాళికాబద్ధంగా రచింపబడుతూ వున్నది.

మానవ జీవితంలో సంతోషము, విచారము, ఉత్సాహము,ఉద్వేగము,ఆసక్తి,నిరాసక్తి ప్రతిక్షణము అనుభావిస్తుంటాము. వీటన్నిటినీ ధైర్యంగా, స్ఫూర్తి గా, తీసుకొని ముందుకు సాగిపోవాలనే సదుద్దేశ్యంతో ఈ ఆరు రుచుల మేళవింపు తో కూడిన ఈ తీర్థప్రసాదములును, ప్రకృతి ప్రసాదంగా, దైవ ప్రసాదాలుగా స్వీకరించి సంతోషంగా జీవితాలను అనుభవించటానికే పెద్దలు వీటిని సంప్రదాయబద్ధంగా యేర్పరచారు. సానుకూల దృక్పథంతో వీటిని మనం ఆచరిస్తూ 'ఉగాది'ని ఉల్లాసంగా హృదయపూర్వకంగా స్వాగతిస్తూ నూతన సంవత్సరం మరింత అభివృద్ధిని సాధించగలమనీ, సుహృద్భావాలతో, నిర్మాణాత్మక నిర్ణయాలతో వసుధైక కుటుంబంగా ముందుకు సాగాలనీ, నవవసంత శోభలతో మనము మన చుట్టూవున్న మానవాళి, ప్రకృతీ వాతావరణమంతా ఆరోగ్యదయకంగా శుభావహంగా వుండాలనీ ఆకాంక్షిస్తూ, ప్రతినిత్యం ఉగాది పండుగగా వెలగాలని ఆ సర్వశక్తిని ప్రార్థిస్తూ, ప్రపంచంలోని అన్ని దేశాలు శాంతి సామరస్యాలతో విలసిల్లాలని ప్రతి ఒక్కరూ ప్రార్థించాలి. ఇదే మనమీనాడు చేపట్టాల్సిన దీక్ష. అప్పుడే మనకు నిజమైన దివ్య ఉగాది. పరిపూర్ణమైన పండుగ కూడా.

---

పూని యేదైనా గట్టి మేలు తలపెట్టడానికి ఈ పండుగాయే మనకు సద్యస్ఫూర్తి. మాటలతో కాకుండా చేతలతో మనం మంచిని ఆదరిద్దాం! ఆచరిద్దాం.

**"లోకాస్సమస్తా సుఖినోభవంతు"**

=============

## నందన సంవత్సరాది పంచరత్నమాలిక

డా|| మాడ్గుల ఆది నారాయణ శాస్త్రి

ఉ|| శ్రీదము పావనమ్మనగ శ్రీలను గూర్పవె స్నిగ్ధ రూపివై,
వేదము నాదమై మిగుల వెల్లులనివ్వగ నిత్యమంతటన్,
పాదుగ వచ్చుచుంటివన పండుగవై ప్రతివత్సరమ్ము నీ
వాదుకొనంగజాలిన మహాత్మవు, శక్తివి నందనాఖ్యవై.

ఎన్నో యుగములు గడచుచు
విన్నాణముములందజేసె వేధలు తీరన్
చెన్నగు సౌందర్యముతో
వన్నెల చిన్నెల యుగాది వచ్చెను ఇలకున్.

శ్రీకరముగ నిల్చి సాకారమైతివి చిన్మయరూపివి సిరులతల్లి!
చివురుల సొంపుల చిన్నెల వన్నెల జగతిని భాసించు చారుశీల!
నూతనశోభల చేతనత్వమునిచ్చు సారస వాసంతి స్వాగతమ్ము,
అరుదైన రంగులనపురూపసౌరభ వరముల పరువమా వందనమ్ము

అన్ని అందాల కలబోత ఆర్యవినుత,
ఆగమాలకు సంకేత అమరకలిత,
ఇందుచందన దీపిత నందనాఖ్య,
నవ్యవాసంత ఋతురాజ దివ్యతేజ.
వేపపూతయు, మామిడి, బెల్లములును
చింతపండును, లవణాది శ్రీకరములు
చేర్చికూర్చిన షడ్రుచిచెలువమనగ,

---

ఉరుతరమ్ముగు పచ్చడి సురుచిరముగ
ఇష్ట దేవతలముందుంచి శిష్ఠ సరళి,
ప్రకృతి మాట నివేదన పరగజేసి,
భక్తిసేవించి నందన సంవత్సరమున
ఆయురారోగ్యభాగ్యములందగలము

**“లోకాస్సమస్తా సుఖినోభవంతు”**

=============

### త్యాగరాజు సన్యాసి

శృతియందు, గతియందు
లయ యందు పదమందు
సుగతి చూపు భక్తి మేళవించి
మతిలేని మానవులకెల్ల నీ
గీతితో ముక్తి నొసగితివోయి త్యాగరాజా !.

మూర్తి త్రయమ్ములో నొకడుగా నిలిచి,
మూర్తిత్రయాతీత బ్రహ్మవైతి
తాపత్రయాభూత సంసారమందు
మునిగి తేలునట్టి మానవాళి
నుద్ధరించు నావ చుక్కానివైతి

నీదు గాన రసాబ్ధిలో నోలలాడి
ప్రజలు తమ్ము తామె మరచినారు
భక్తి, వేదాంతాలు రెండూ
ముక్తి సోపానాలన్న మాట
నీవు ఋజువు చేసినావు

నీ కవితలో గానమున్నదని యొకడు,
లేదు,లేదు నీ గానమ్ములోనె కవిత
కలదంచు మరియొకడు, వాదులాడ
గాన, కవితలకు రాణి యగు ఆ వాగ్దేవి నిన్ను
వాగ్గేయకారునిగ దీవించెనయ్య.

రాజ సత్కారములు త్రోసిపుచ్చినావు
నీ తిరస్కారములు లోక విదితమాయె
రాజవరుడైన ఆ రామచంద్రుడు నీకండగానుండ,
తేజమ్ము, యశస్సు, శ్రేయస్సు నిను వరించె.

కులమతాల కతీతమైన గీతి
మనసు స్పందించు మానవాతీత గీతి
కూనలనించి, గూనితో నడుచు వృద్ధులంతా కలిసి
మనసు తీరగా పాడుకొను భావనాతీత గీతి.

ఊరూరా వెలసినవి నీ విగ్రహాలు
దేశ,దేశాల పుట్టె నీ నామ సంఘాలు
కుక్కగొడుగులవలె పుట్టుకొచ్చినాయి
ఒక్కడైన నీ పాటలో మాట తీరు
చక్కగా గ్రహియించి నడుచుకోలేదు.

---

నీవున్న తిరువూరు ఒక క్షేత్రమాయె
నీదు ఆరాధన జగద్వ్యాప్తమాయె
నీవూరు చూడ ధైర్యమ్ము నాకు లేదు
నాధనమ్ము దోచెదరను భయముతోను.

అందుకని నిన్ను నిత్యమ్ము తలచుకొనుచు
కాలమ్ము వెళ్ళదీయుదు నా ఇంటిలోనె
కలకాలమ్ము నీ కృతుల భావమ్ములన్నీ
కలిపి, కలబోసి నా మదిలోన పోసికొందు.

రెండేళ్ళకింద నేను భారత దేశం వెళ్ళినప్పుడు,తిరువయ్యూరు త్యాగరాజ ఆరాధనకి వెళ్దామనుకుంటే, అందరూ నన్ను భయపెట్టేసేరు. " అక్కడ జేబు దొంగతనాలు జాస్తి, ఆ  సమారాధనల సమయంలోనే గాని తర్వాత ఆ వూరిని గాని, త్యాగరాజు సమాధిని గాని ఎవరూ పట్టించు కోరు " అని నిరుత్సాహ పరిచేరు.  అంతేకాదు, ఆసమాధి మందిరం శిధిలమైపోతున్నాదనీ, ఇంటి కప్పు వర్షాలకు నీరు కారుతున్నాదనీ,దానికి సేకరించిన నిధులన్ని దుర్వినియోగం చేస్తున్నారనీ చెప్పేరు. అప్పుడు స్పందించి వ్రాసినది........

=============

## అమ్మ

మైలవరపు సాయికృష్ణ

బ్రతుకు కాదని జన్మమిచ్చినావు
కంటికి రెప్పవై నన్ను కాచినావు

నా కోసరము ఎన్ని వదలినావు
ఆది గురువువై విద్య నేర్పినావు

మంచి మాటలు మూటలు ఇచ్చినావు
మంచి వంటలు మిక్కిలి చేసి పెట్టినావు

ఎందరికి నా గొప్పలు చెప్పినావు
నా తప్పులు ఎన్ని సరిదిద్దినావు

ఇలవేల్పుకు మించిన గొప్ప వేలుపు నీవు
క్షణము మరువను నిన్ను
నీ బాటను నడువగలను

=============

## కన్నీటి చుక్క ప్రయాణం

లక్ష్మి భమిడిపాటి

---------ఇది మీ కధ - నా కధ - మనందరి కధ--------

అప్పుడు నాకు 17 ఏళ్ళు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఇంజనీరింగ్ సీట్ వచ్చింది.
మొదటి సారిగా ఇల్లు వదలి వెళుతున్న తరుణం. ఒక పక్క ఆనందం. ఒక పక్క భయం.
ఈస్ట్ కోస్ట్ ఎక్స్ ప్రెస్ హడావుడిగా వచ్చి మా వూరు ట్రైన్ స్టేషన్ లో ఒక నిముషం కోసం ఆగింది.
గబగబా ట్రైన్ ఎక్కాను.

---

గార్డు పచ్చ ఝుండా ఊపాడు.

ట్రైన్ "చ్చు" అంటూ పొగ వదిలింది.

"ఉంటానమ్మా" అన్నాను నేను.

మా అమ్మ కిటికీలో చేతులు పెట్టి, నా ముఖాన్ని దగ్గరగా తీసుకుని ఒక ముద్దు పెట్టి
చెప్పింది "ఈ చేతులతో పెంచానురా! నన్ను వదిలి వెళ్లిపోతున్నవురా నా బంగారం!" ..

ట్రైన్ ప్లాట్ఫారం దాటింది.

చేతి మీద తడిగా .... చిన్న కన్నీటి చుక్క... అమ్మ కళ్ళలో నుంచి వచ్చింది అది.
ఆ కన్నీటి చుక్కని చూసుకుంటూ... గతం లోకి వెళ్ళింది నా మనసు...
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నా చిన్నప్పుడు రోజు పాపిడి తీసి, జుట్టు దువ్వి, పౌడర్ రాసి, ఒక ముద్దు పెట్టి నన్ను స్కూల్ కి పంపించేది మా అమ్మ.
టిఫిన్ బాక్స్ లో నాకు ఇష్టమని బోల్డు సార్లు పులిహోర, టమేటో పెరుగు పచ్చడి చేసి పట్టేది మా అమ్మ.
నాన్నషర్టు జేబులోంచి దొంగతనము చేసి పావలా ఇచ్చేది, మధ్యాహ్నం మామిడి బద్దలు కొనుక్కు తినమని మా అమ్మ.

నన్ను వొళ్ళో కూర్చోబెట్టుకొని రోజూ భగవద్గీత చదువుకొనేది మా అమ్మ.

స్కూల్ ఫస్ట్ వచ్చినప్పుడల్లా, పక్కింటి వాళ్ళతో గర్వంగా చెప్పుకొనేది మా అమ్మ.

ఇంటర్ లో పరీక్షలు......నా పక్కనే కుర్చుని, నాతో పాటే కునికి పాట్లు పాడేది మా అమ్మ.
ఎంట్రన్సు పరీక్ష కోసం కష్ట పడుతుంటే, నన్ను కుందరదన లాగ చూసుకొనేది మా అమ్మ.
అలా 17 వసంతాలు నా జీవితంలో భాగం అయిపోయింది మా అమ్మ. కాదు కాదు. అమ్మ జీవితంలో భాగం అయిపోయాను నేను.
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈస్ట్ కోస్ట్ ఎక్స్ ప్రెస్ "చక్ చక్ చక్" మని పరుగులు పెడుతోంది. కిందకి చుస్తే గోదావరి అమ్మ లాగ నవ్వుతూ ప్రవహిస్తోంది .

నా చేతి మీద కన్నీటి చుక్క, అలా చర్మంలో ఇంకి పోయి, రక్తంలో ప్రవహించి, గుండెల్లో కలసిపోయింది. గుండెల్లో భాగమైపోయింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆ తరువాత నుంచి చాలా సార్లు మార్చాను క్యాలెండర్ నేను. శాక్రమెంటోకి వచ్చి జీవితంలో స్థిర పడ్డాను.

అమ్మ మాత్రం అస్తమాటు గుర్తుకువచ్చేది. నా గుండెల్లో ఇంకి పోయిన కన్నీటి చుక్క, కంటి చిగురు దాక వచ్చి ఆగి పోయేది. బయటకు మాత్రము వచ్చేది కాదు.

పెళ్లి పీటల మీద తలంబ్రాలు పోస్తుంటే, అమ్మని పోరకంటిగా చూసాను. గుండెల్లో కన్నీటి భాష్పం, కంటి కొనల్లో పోరగా వచ్చి ఆగిపోయింది.

మొదటి సారిగా కొడుకుని ఎత్తుకుంటే, నా గుండెల్లో కన్నీటి చుక్క, కంటి చివరకి మళ్ళీ వొచ్చి, నేను ఇంకా బయటకి రావాలా అని అడిగింది. వద్దని చెప్పి గుండెల్లోకి వెనక్కి పంపించేసాను.
టమేటో పెరుగు పచ్చడి తింటుంటే, మామిడి బద్దలు తింటుంటే, అమ్మ గుర్తుకువచ్చి, గుండె కన్నీటి చుక్కని బయటకి పంపాడానికి ప్రయత్నించేది.

భగవద్గీత చదువుతుంటే, కన్నీటి చుక్క నేను వున్నానని గుర్తుకు చేసేది.
అంతా బాగానే వుంది. చక్కటి బెటర్ హాఫ్, చక్కటి పిల్లలూ, బోల్డెంత డబ్బు. కాని నా కన్నీటి చుక్కకి వాటికి సంబంధం లేదు. అది ఆనందము కాదు. విషాదము కాదు. కన్నీటి చుక్క గుర్తుకు వచ్చినప్పుడల్లా ఏదో అర్ధము కాని భావావేశం.
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అలా జీవితం లో ఇంకోన్ని వసంతాలు గడచి పోయాయి.
విమానాశ్రయంలో లో అన్నౌన్సర్ చెప్పింది "దిసీస్ ది లాస్ట్ కాల్ ఫర్ హిమాంశు భమిడిపాటి ఫార్ ఫ్లైట్#౩౦౩ ఫ్రం శాక్రమెంటో టు బోస్టన్."

మా పెద్ద అబ్బాయికి సీట్ వచ్చింది హార్వర్డ్ లో.

"ఉంటానమ్మా" హిమాంశు గొంతుక.

నా కొడుకు ముఖాన్ని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టి చేప్పాను

"ఈ చేతులతో పెంచానురా... నన్ను వదిలి వెళ్లి పోతున్నవురా నా బంగారం".

గుండె లోతుల్లోనుచి, బయలుదేరి, కంటి చివర దాక వచ్చింది నా కన్నీటి చుక్క.
కాని ఈసారి మాత్రం కంటి చివర ఆగ లేదు.
అప్రయత్నంగా మొదటి సారిగా బయటకు వచ్చి, నా కొడుకు నుదిటి మీద వాలింది....

=============

## అమెరికాలో మా అనుభవాలు

డా|| మాడ్గుల ఆది నారాయణ శాస్త్రి

'అమెరికా' - ఈ మాట సామాన్యుడికి కలలోనిది. చదువుకున్న యువకులకు, ముఖ్యంగా సాంకేతిక, వైద్య పట్టభద్రులకు ఒక బంగారు కల. ఇక్కడ ఉదోగాలు చేసేవారికి ఒక విధంగా భూతల స్వర్గమే! దర్శనీయ స్థలాలను చూడవచ్చేవారు, ఇక్కడ నివసించేవారి తల్లిదండ్రులకు ఇదొక మహదవకాశం.

.

మేము మొట్టమొదటిసారిగా ౨౦౦౧ సం|| ఏప్రియల్లో వచ్చి, ఆరు నెలలు గడిపి వెళ్ళినాము. అప్పుడు మా పెద్దబ్బాయి చి||శ్రీకాంత్ కుటుంబం శాక్రమెంటో లోని రోజ్విల్లో వుండేది. చిన్నబ్బాయి చి||శైలేంద్ర సాన్ హోజేలో వుండేవాడు. ఇద్దరూ కాల్ఫోర్నియా రాష్ట్రం లోనే వున్నారు కాబట్టి ఇక్కడి ప్రాంతాన్నేగాక, అప్పుడు లాస్ ఎంజిల్స్ ప్రాంతం లోని డిస్నీలాండ్, సీ వరల్డ్, హాలీవుడ్ లాంటి చూసి వచ్చాము. భారత దేశం లో వుండే ఉద్యానవనాలకి, ఇక్కడి వాటికీ, ఇట్లాంటి ప్రత్యేక దర్శనీయాలలో చాలా తేడా వుంది. శుచి, శుభ్రతలకు ప్రాధన్యమిస్తూనే దుమ్ము-ధూళి లేకుండా, మురికి-మాయా లేకుండా ఎక్కడికక్కడ క్రమపద్ధతులు పాటిస్తూ, దుకాణాలు, హోటళ్ళు, మాల్ లూ, ఇతర వ్యాపార కేంద్రాలు బాగా నిర్వహింపబడుతున్నాయి. ప్రధాన రహదారులు, అక్కడక్కడ వుండే చిన్న రహదార్లు, ఆయా స్థలాల్లో సి.సి.కెమేరాలు, రాడార్లు, రహదార్ల మధ్యలో సూచనలు, పక్కలందు డివైడర్లు, మొక్కలు, చెట్లు, పచ్చగడ్డి మైదానాలు, ప్రతి ఇంటి ముంగిట పచ్చగడ్డి ప్రదేశాలు, ముచ్చటగోలిపే అందాలూ, వెరసి అలంకారాలుగా భాసిస్తున్నాయి, వాతావరణాన్నీ కలుష్యరహితం చేస్తున్నాయి.

గ్రంథాలయాల్లో వివిధ పుస్తకాలే కాకుండా గణక యంత్రాలు, అంతర్జాల సదుపాయము, పుస్తకాల పట్టికలు అక్షరక్రమం లో తెలిపే పద్ధతి, పుస్తకాలని గ్రహించే విధానం, వెనక్కి ఇచ్చే విధానాలు సాంకేతికంగా, నిర్దుష్టంగా వుంటూ కాలాన్ని ఆదా చేస్తున్నాయి.

*భాష-సంస్కృతి వికాసాలు:* చాలాచోట్ల వారి వారి కార్యాలయాల్లో ఆంగ్లమే మాధ్యమంగా వాడినా,

ఇళ్ళలో, దేవాలయాల్లో ఆయా ప్రాంతీయభాషీయులు కలసినప్పుడు మాతృభాషలోనే మాట్లాడుకుంటున్నారు. భాషా పరిరక్షణ, అభివృద్ధి కోసం కొందరు బర్కిలీ, టెక్సాస్ విశ్వవిద్యాలయల ద్వారా అక్షరోద్యమాలను చేపట్టి ఇతోధికంగా, ఇష్టంగా సేవలందిచటం చాలా సంతోషించదగ్గ విషయం. పాఠశాల విద్యాబోధనలో మన వారు ఇక్కడి ఉపాధ్యాయులతో పాటు ఉచితంగా బోధన అందించటం ప్రశంసిచదగ్గ విషయం. వివిధ తెలుగు భాషా సంఘాలు ప్రాంతీయ, జాతీయ పరిధుల్లో అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. నేను కూడా యిక్కడి సంక్రాంతి సంబరాల్లో పాల్గొని స్వీయకవిత వినిపించటం నా అదృష్టం. సంక్రాంతి, ఉగాది, దసరా వంటి పర్వదినాల్లో ఇక్కడి పిల్లల, పెద్దల సహజ కళల్ని, శక్తుల్ని, ఉత్సాహాన్ని గమనించి అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. నృత్యాలు, సంగీత కార్యక్రమాలు, పౌరాణిక, సాంఘిక నాటకాలు, స్వీయకవితలు మున్నగు ఎన్నో ప్రక్రియల్ని చేపడుతున్నారు, ప్రోత్సహిస్తున్నారు. భారతదేశం నుండి ప్రసిద్ధ కవుల్ని, గాయక-గాయకీమణులను, నటులను, కళాకారులను పిలిపించి, వారి శక్తియుక్తులను ప్రదర్శింపచేసి సన్మానించడం నిజంగా అభినందనీయం.

ఇక్కడి 'ఎంపైర్ వోక్స్' ప్రాథమిక పతశాలలో గతవారం ఆంగ్ల నాటక కర్త షేక్స్పియర్ గారి ప్రసిద్ధ నాటకం 'మాక్బెత్' ను, ౩,౪,౫ తరగతుల చిన్నారులు ప్రదర్శించి ఆకట్టుకోవడం చాలా ప్రశంసనీయమైన విషయం. ఇందులో ఒక భారతీయ విద్యార్థి 'మాక్బెత్' పాత్ర ధరించి ఇచ్చటి స్థానికులైన అమెరికన్లను కూడా మెప్పించటం నిజంగా గర్వించదగ్గ విషయం.

శాక్రమెంటో చేరువలో శ్రీ స్వామి శివానంద ఆశ్రమం నిజంగా చూడదగ్గది. ఇంకా ఇచ్చటి చెరువులు, ఆనకట్టలు, వాటిని నిర్వహించే తీరుతీరు చోస్తే మనం, మనదేశంలోని వారు వీరి నుండి నేర్చుకోవలసింది ఎంతోవుందనిపిస్తుంది. దగ్గరలోని 'ఫోల్సం' చెరువు, 'టహో' చెరువు చాలా బాగున్నాయి.

రహదారుల్లో పాదచారులకు, ద్విచక్ర వాహకులకు ప్రత్యేక దారులున్నాయి. కార్లు, ఇతర వాహనాలు నిరంతరంగా వెళుతూనే వుంటాయి. వాహ్యాళికి వెళ్ళేవారు అక్కడక్కడ కనిపిస్తారు తప్ప, వీధులపై జనసమ్మర్దము కనిపించదు. భారతదేశంలోలాగా 'దుమ్ము లేపే' త్రిచక్ర, ద్విచక్ర వాహనాలు ఇక్కడ మచ్చుకైనా కనిపించవు.

*ఇక్కడి అనుభవాల్లో కొన్ని కష్టనష్టాలు:* బయటికి ఎక్కడికి వెళ్ళాలన్నా వాహన ప్రయాణం తప్పనిసరి. మన దేశం లో వలె చిన్న చిన్న వాహనాలు కనిపించవు. సిటీ బస్సులున్నా అవి చేతనైనావారికీ, సమయమున్నవారికీ, బాగా తెలిసినవారికేగానీ అందరికీ అందుబాటులో ఉండవు. ఆంగ్లభాష తెలియక పోతే మరీ కష్టము. సాన్ హోజేలో అన్నీ దగ్గర దగ్గర, ఇక్కడ అన్నీ దూరమే! ఇక్కడికి వచ్చిన పెద్దలుమాత్రం వారాంతాలకోసం ఎదురు చూడక తప్పదు. పుస్తకపఠనం, దూరదర్శిని ప్రసారాలు మన భాషలో రావడం కొద్ది మేలు.

---

ఇక్కడే వుద్యోగాల్లో వుండేవారికి ఇక్కడి వరాలే ఎక్కువ. బయటినుండి వచ్చి నెలల తరబడి వుండేవారికి కొంత కష్టం. ఇద్దరుగా వుంటే కొద్దిలో కొద్ది మేలు. రచయితలు, పఠితలు కాలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఇక్కడ మరొక్క గొప్ప విషయం – నిరంతర విద్యుత్తు సరఫరా, నీటి సరఫరా – ఇది నిజంగా అభినందనీయం. ఈ రెంటికీ మన దేశంలో కోతలు అమితంగా వున్నాయి. విద్యాపరంగా చాలా మంచి నాణ్యత వుందని చెబుతారు. మనదేశం లో వీటి స్థాయి తక్కువేనని చెప్పాలి. అయితే మనవారు లేనిది ఇక్కడ పెద్ద సంస్థల్లో పనులు జరగవనీ, మన వారు వుద్యోగాలు సమర్ధవంతంగా నిర్వహిస్తారనీ పేరు బాగా వుంది. 'డాలర్ విలువ డాలర్దే'!!

ఏది ఏమైనా 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్న సూక్తి మాత్రం సత్యము.

=============

## నవ్వుల పందిరి / హాస్య వల్లరి

### సామెతలని పూరించండి

1. ---- లేని దురద ------- ఎందుకో
2. -----చేలో మేస్తే -------గట్టున మేస్తుందా?
3. వింటే ------వినాలి తింటే ------తినాలి
4. -----చచ్చినా -------చావలెదు
5. ఆకలి------ఎరుగదు -------సుఖమెరుగదు
6. ------వాది---------విరోధి
7. ----దొంగ అంటే------తణువుకున్నట్టు
8. ---- కి ఏంతెల్సు------వాసన

=============

## వంట వార్పు

### పదహారణాల తెలుగు వంటకం ఉప్పుపిండి

కావలిసిన పదార్ధాలు

1 కప్పు బియ్యపు రవ్వ
3 కప్పులు నీళ్ళు
1/4 కప్పు పచ్చి కొబ్బరి
1/4 కప్పు పెసరపప్పు
1 టీస్పూన్ జీలకర్ర
2 టేబుల్ స్పూన్ నూనె
అల్లం పచ్చిమిర్చి ఉప్పు రుచి కి సరిపడినంతగా

---

కరివేపాకు

పోపు దినుసులు

1 టేబులు స్పూన్ సెనగ పప్పు

1టేబులు స్పూన్ మినప పప్పు

2 ఎండు మిరప కాయలు

ముందుగా దళసరి పాన్ తీసుకొని స్టవ్ మీద మీడియం హీట్ లో ఉంచండి
నూనె వేసి కాగనివ్వాలి కొంచెం కాగాక పోపుదినుసులు వేసి వేయించండి
పోపు వెగిన తరువాత నీళ్ళు పొయ్యండి ఉప్పు చేర్చండి
అల్లం పచ్చి మిర్చి కరివేపాకు జీలకర్ర, పెసరపప్పు, పచ్చికొబ్బరి కూడా వేయండి
ఒక సారి కలిపి మూత పెట్టండి 5 నిముషాల పాటు మరగనివ్వండి
ఇప్పుడు ఇంకొంచెం నూనె వెయ్యండి నీళ్ళని మెల్లగ కలుపుతూ బియ్యపు రవ్వని కొంచెం కొంచెం గా నీళ్ళ లో వేస్తూ కలపండి. రవ్వ అంతా వేసిన తరువాత మంట తగ్గించి మూత పెట్టి 5 నిముషాల పాటు ఉడకనివ్వాలి తరువాత స్టవ్ ఆపేసెయండి. ఈ ఉప్పు పిండి వేడిగనూ చల్లారిన తరవాత కుడ రుచిగ ఉంటుంది కొబ్బరి పచ్చడితో కాని అల్లం పచ్చడితో కాని తింటే బాగుంటుంది.

=============

## చలన (వి)చిత్రం

**వాణి**

సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారి అద్భుత సృష్టి ప్రకృతిలో జనప్రియమైన వస్తువులని క్షణికమైన ఆయువునిచ్చి అప్రియమైన వస్తువులకి అపారమైన ఆయువునొసగిన విధాతని నిలదీసిన వైనం, దీన్నే మనవాళ్ళు నిష్టూరం ఆడటం అంటారు కవిత్వంలో నిందా స్తుతి ప్రక్రియలలో ఒకటి గా చెప్పుకో వచ్చు

చిత్రం సిరివెన్నెల(1986)
గానం:బాలసుబ్రహ్మణ్యం
రచన:సీతారామ శాస్త్రి
సంగీతం:కె.వి.మహదేవన్

ఆదిభిక్షువు వాడినేది కోరేది? బూడిదిచ్చే వాడినేది అడిగేది? (2)
ఏది కోరేది, వాడినేది అడిగేది? (2)

తీపిరాగాల ఆ కోకిలమ్మకు నల్ల రంగునలమినవానినేది కోరేది? (2)
కరకు గర్జనల మేఘముల మేనికి మెరుపు హంగు కూర్చినవాడినేది అడిగేది?
ఏది కోరేది, వాడినేది అడిగేది? (2)

తేనెలొలికే పూలవనలకు మూణ్ణాళ్ళ ఆయువిచ్చినవాడినేది కోరేది? (2)
బండరాళ్ళను చిరాయువుగ జీవించమని ఆనతిచ్చినవాడినేది అడిగేది?
ఏది కోరేది, వాడినేది అడిగేది? (2)

గిరిబాలతో తనకు కళ్యాణమొనరింప దరిచేరు మన్మథుని మసి జేసినాడు
వాడినేది కోరేది?
వరగర్వమున మూడు లోకాలు పీడింప తలపోయు దనుజులను కరుణించినాడు
వాడినేది అడిగేది?

ముఖప్రీతి కోరేటి ఉబ్బుశంకరుడు, వాడినేది కోరేది?
ముక్కంటి, ముక్కోపి (2) తిక్కశంకరుడు!

ఆదిభిక్షువు వాడినేది కోరేది? బూడిదిచ్చే వాడినేది అడిగేది?
ఏది కోరేది, వాడినేది అడిగేది?

=============

## ఇవి అవి మరిన్ని
## “తెలుసుకోండి”

మీకు ఓ.సి.ఐ. కార్డు వుందా? అయితే భారతదేశ ప్రయాణంలో ఈ కార్డును, ఓ.సి.ఐ. వీసా ముద్ర వున్న పాసుపోర్టును తప్పకుండా తీసుకెళ్లండి. మీకు ఇటీవలే కొత్త పాసుపోర్టు వచ్చినట్టయితే, ఓ.సి.ఐ. కార్డుతో పాటు పాత పాసుపోర్టును కూడా తీసుకువెళ్ళండి.

=============

## ఎందరో మహానుభావులు

ఎందరో మహానుభావులు శీర్షికలో ఈ సంచికలో తన గీతలతో తెలుగువారి మనసులని దోచుకున్న కళా మూర్తి బాపు గారి గురించి నాలుగు మాటలు ...

## *తెలుగు వారి ముద్దుగుమ్మ బాపు బొమ్మ.....*

చక్కటి కట్టు బొట్టు, చెంపకు చారెడు కళ్ళు, తీరైన ముక్కు, పిడికెడు నడుము, బారెడు జడ, అందమైన శరీర శౌష్టవం - ఇవన్నీ కలబోసిన తెలుగువారి ముద్దుగుమ్మ బాపు బొమ్మ. ఒక తెలుగు అమ్మాయిని చూడగానే పదహారణాల ఆడపిల్ల అని చెప్పటంలో ఎంత తెలుగు తనం ఉంటుందో బాపుబొమ్మ అని చెప్పటంలో అంత సౌందర్యం ఉట్టిపడుతుంది. బాపు గారి పాత్రల సృష్టి అంతా తన కలం గీతలలోనే ఉంటుంది. ఆ గీతలు గీయటంలో తనదంటూ ఒక ప్రత్యేక శైలిని చూపిస్తూ వచ్చారు బాపు గారు. వీరి బొమ్మలు ఎంతో స్వచ్ఛంగా, వాటి భావాలని సూటి గా ప్రతిబింబేంచేట్టుగా ఉంటాయి. ఎంత పెద్ద పాత్రలనైనా ఆయా పాత్రల స్వభావాలను, హావభావాలను, అతితక్కువ గీతలతో సృష్టించి జీవం పోసి వాటికి పాఠకుల హృదయాలలో సుస్థిర స్థానం కల్పించారు. తెలుగు పత్రికా, సినీ రంగాలన అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసారు. బాపు గారి ప్రత్యేకత ఏమిటంటే ఆయన చేసిన బొమ్మని తెలుగువారు తమ పొత్తిళ్ళలో పెట్టుకుని పెంచారనటం. అంటే ఆయన వ్రాసిన వ్రాతలు గీసిన బొమ్మలు తెలుగువారి ఇంట పెరిగి పెద్దవటం.

బాపు గారు మొదట్లో సృష్టించిన భామ పాత్ర కాలక్రమేణా బామ్మగా కూడా తెలుగు వారిని అలరించటమే అనుబంధానికి నిదర్శనం. అందుకు బాపుగారి గీతలకి తన స్నేహితులైన ముళ్ళపూడి వెంకటరమణ గారి మాటలు జత చేసి ఇరువురు జంటగా తెలుగు ప్రజలని సుమారు 50 సంవత్సరాలు ఆలరించారు. తుంటరి పనులు చేస్తూ, కొంటె ప్రశ్నలు వేస్తూ బడిలో తన మాష్టారిని ఇంట్లో బాబాయిని అల్లరి పెట్టే 'బుడుగు', వాడికి తోడుగా రెండుజళ్ళతో పెద్ద పెద్ద కళ్ళతో బుడుగుతో ప్రేమాయణం సాగించిన 'భామ' రమణ గారి సృష్టి.



శ్రీ సత్తి రాజు లక్ష్మీ నారయణ గారు కొంటె బొమ్మల బాపుగా తెలుగు వారికి సుపరిచితులు. సుమారు అర్ధశతాబ్ది కాలంగా బాపు గారి బొమ్మ తెలుగు వారిని అలరిస్తూ తెలుగుదనానికి అద్దం పడుతోందనటంలో అతిశయోక్తి లేదు. బాపు గారు 1933 డిశెంబరు 15 వ తేదీ న పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో జన్మించారు.1955 లో మద్రాసు యూనివర్సిటీ నుంచీ న్యాయశాస్త్ర పట్టా పొందారు.1945వ సంవత్సరంలో అంటే చదువుతున్న రోజుల్లోనే ఆంధ్ర పత్రికలో పొలిటికల్ కార్టూన్లు వేయటం మొదలుపెట్టారు. బాపు గారు తనదీన శైలిలో అందిచిన బాపు బొమ్మల రామాయణం ఆ తరహాలో బొమ్మల తో కథలు చెప్పించే ఒక ప్రయోగంగా చెప్పుకోవచ్చు.



బాపు గారి వ్రాత కూడా ఒక ప్రత్యేకం. బాపు గారు వేసిన అనేక పురాణ కధలు చిత్రాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. ముఖ్యంగా రాముడు,కృష్ణుడు దుర్యోధనుడు,సత్యభామ పాత్రలను మరియు వారి హావభావాలను చిత్రించటం బాపు గారి ప్రత్యేకత. పైగా స్వభావ రీత్యా మాటలలో ఎంత పొదుపరో గీతలలో కూడా అంత పొదుపరి. తన చిన్ననాటి స్నేహితుడైన ముళ్ళపూడి వెంకటరమణ గారితో కలసి చలనచిత్ర, పత్రికా రంగాలలో దాదాపు 5 దశబ్దాల పాటు తెలుగు వారిని అలరిస్తూవున్నారు. బాపు రమణలు అందించిన బుడుగు భామలను తెలుగువారెన్నడూ మరిచిపోలేరు. వీరిద్దరి సమన్వయంలో వచ్చిన సినిమాలు తెలుగుతనానికి నిలువుటద్దం పట్టాయి. ఉదాహరణకు సంపూర్ణ రామాయణం, వెలుగునీడలు,ముత్యాలముగ్గు, సాక్షి, శ్రీరామరాజ్యం ఇంక ఎన్నో...

బాపు గారు ఎన్నో ప్రశంసలు కుడా అందుకున్నారు. జాతీయ ఉత్తమ చిత్రం, 24 నందులు,3 ఫిలింఫేర్ ప్రశంసలు ఒక "లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు" తన ఖాతా లో వేసుకున్నారు. అందెకే ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరూ బాపు గారి సేవలని కొనియాడుతునే ఉంటారు. ఈ ఉగాది సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వము బాపు గారికి"కళారత్న" పురస్కారాన్నిచ్చి సత్కరించటం ఎంతో ఆనంద దాయకం. బాపు గారికి శుభాకాంక్షలు తెలుపుతూ, తెలుగు వారిని పదికాలల పాటు ఇలాగే అలరించాలని కోరుకుందాం.

=============

## ప్రముఖాంధ్రులు

తెలుగు జాతికి ఖ్యాతిని తెచ్చిన ఎందరో ప్రతిభావంతులు ఉన్నారు. అన్ని రంగాల్లోను ప్రతిభామూర్తులై వెలిగి జాతికి స్ఫూర్తిగా నిలిచిన అటువంటి మహనీయుల్లో కొందరి వివరాలను లేశమాత్రంగా తెలుసుకుందాం.

* శంకరంబాడి సుందరాచారి: రాష్ట్ర గీతమైన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అన్న గేయాన్ని రచించి తెలుగు జాతికి అంకిత మిచ్చిన మహాకవి. తిరుపతి వాస్తవ్యులైన వీరికి నిన్నమొన్నటి దాకా దక్కాల్సినంత పేరు దక్కలేదు. ఈ మధ్యనే తిరుపతిలో

సుందరాచారి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

* పొట్టి శ్రీరాములు (1901-1952): ఆంధ్రరాష్ట్ర అవతరణకోసం ఆత్మార్పణం చేసిన త్యాగ ధనుడు. సత్యము, అహింస, హరిజనోద్ధరణ ప్రధానాశయాలుగా గాంధీజీ అడుగు జాడల్లో నడచిన మహనీయుడు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంకోసం నిరశన వ్రతం చేసి అసువులు బాసారు. తత్ఫలితంగానే నేటి ఆంధ్రప్రదేశ్ అవతరణ.

* కందుకూరి వీరేశలింగం (1948-1919): గొప్ప సంఘ సంస్కర్త, సాహితీ వేత్త. కథ, నవల, వ్యాసం వంటి అనేక తెలుగు సాహిత్య శ్రీకారం చుట్టినవాడు. స్త్రీ విద్యను, వితంతు వివాహాలను ప్రోత్సహించాడు. వివేకవర్ధిని పత్రికను స్థాపించి సమాజంలో అప్పటికే పేరుకుపోయిన మూఢాచారాలను, దురాచారాలను తూర్పార బట్టారు. అధికార వర్గాల్లోని అవినీతి, అక్రమాలను కలం బలంతో బట్టబయలు చేశారు.

* గురజాడ అప్పారావు (1862-1915): 'దేశమును ప్రేమించుమన్నా' అంటూ దేశ భక్తి గీతాన్ని ప్రబోధించిన నవయుగ వైతాళికుడు. భాషా సాహిత్యాలు, కళలు దేశ హితానికి ఉపయోగపడాలని ఆకాంక్షించిన సమాజోద్ధరణాభిలాషి. గురజాడ సృష్టించిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యక అనే కావ్యాలు తెలుగు వారి కంట తడి పెట్టిస్తూనే ఆయన కాలం నాటికి సమాజంలో పాతుకు పోయిన మూఢాచారాలపై ధ్వజమెత్తాయి.

* టంగుటూరి ప్రకాశం పంతులు (1872-1957): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. తెలుగు వారి గుండెలొల్లో ఆంధ్రకేసరిగా ఈయన స్థానం పదిలం. బారిస్టర్‌గా ప్రాక్టీసు పెట్టి కోట్లు సంపాదించే అవకాశమున్నా గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించాడు. సైమన్ కమిషన్ వచ్చినపుడు పోలీసుల తుపాకీ గుండుకు తన గుండెను ఎదురొడ్డి నిలిచి ఆంధ్ర జాతి గుండెను గెలుచుకున్నారు.

* పింగళి వెంకయ్య (1878-1963): భారత జాతీయ త్రివర్ణ పతాక నిర్మాత. స్వాతంత్ర్య సమర యోధుడు, వ్యవసాయ శాస్త్రవేత్త, గుండె నిండుగా దేశాభిమానమే కాదు, మెదడు నిండుగా విజ్ఞానాన్ని ధరించిన వాడు. కాంబోడియా పత్తి రకాన్ని పరిశోధించి, పండించి వ్యవసాయ శాస్త్రం అనే గ్రంథాన్ని రచించాడు అనేక బంగారు, వెండి పతకాలను గెలుపొంది రాయల్ ఎగ్రికల్చర్ సొసైటీకి సభ్యుడుగా ఎన్నికయ్యారు.

* డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు (1895-1948): ప్రఖ్యాత వైద్య శాస్త్రవేత్త. ఆధునిక వైద్యంలో అనేక అద్భుత ఆవిష్కరణలు చేసిన వ్యక్తి. ముఖ్యంగా బోదకాలు వ్యాధి నివారణకు ఉపయోగించే డై ఈథైల్ కార్బామజీన్ అనే మందును కనుగొన్నారు. 1945లో ఆరియోమైసిన్ అనే యాంటీబయోటిక్ మందును ఆవిష్కరించారు. పాండురోగ నివారణకు పోలికామ్లం, క్షయ రోగానికి పసోనికోటినికాసిడ్ హైడ్రోజన్‌లను కనుగొన్నారు.

=============

## తెలుగు విజేతలు

### నరేంద్ర పత్తిపాటి

నరేంద్ర గారు అనంతపురం లో పుట్టి తిరుపతిలో పెరిగారు. ఐ.ఐ.టి. ఖరగ్పూర్ నుంచి పట్టా పుచ్చుకున్న వెంటనే టాటా మోటార్స్ లో మొదటి ఉద్యోగం. తర్వాత ఆయన భారతదేశంలో "రోటరీ ఎంబాసడోరియల్ స్కాలర్" గా ఎన్నికై యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్, మేడిసన్ లో ఎం.బి.ఏ చదివారు.

నరేంద్రగారికి కుటుంబమన్నా, స్నేహితులన్నా, తోటి సమాజమన్నా చాలా మక్కువ. శ్రీదేవిగారిని తో 27 ఏళ్ళక్రితం వివాహం జరిగింది. వారి అన్యోన్య దాంపత్యంలో పుట్టిన అనీష్, అఖిలేష్, ఇద్దరు అబ్బాయిలూ కాలేజీ వయస్కులు. అనీష్ వార్టన్ బిజినెస్ స్కూలు లోనూ, అఖిలేష్ హార్వర్డ్ లోనూ చదువుకుంటున్నారు. పత్తిపాటి కుటుంబం నలుగురుకీ ప్రయాణాలన్నా, చలన చిత్రాలన్నా, క్రీడలన్నా చాలా ఇష్టం.



నరేంద్రగారు ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రసిద్ది చెందిన "టైకర్ట్" నిర్మాణ సంస్థలో కార్యనిర్వాహక ఉపాధ్యక్షునిగా, ముఖ్య ఆర్థికాధికారి (సి.ఎఫ్.ఓ) గానూ పనిచేస్తున్నారు. చిన్న కంపెనీ దగ్గరినించి, గ్లోబల్ 1000 దాకా ఆయన నిర్మాణ, సేవా, సాంకేతిక రంగాల్లో ముఖ్య ఆర్థికాధికారిగా పనిచేసారు. నరేంద్ర గారు చాలా సంస్థల నిర్ణయ సంఘల్లోనూ, సేవా సంస్థల్లోనూ ఉన్నారు. ప్రస్తుతం, సట్టర్ హెల్త్, మన స్వర్ణోయలోని వెల్స్ ఫార్గో బ్యాంకు, S.A.C.T.O, డ్రెక్సెల్ యూనివర్సిటీ వారి గ్రాడ్యుయేట్ స్టడీస్ బోర్డులోనూ నిర్దేశాకులుగా ఉన్నారు.

నరేంద్రగారికి ఎన్నో పురస్కారాలు లభించాయి. గత ఏడాది నరేంద్ర గారిని "సి.ఎఫ్.ఓ ఆఫ్ ది ఇయర్" గా శాక్రమెంటో బిజినెస్ జర్నల్ గుర్తించడం ముదావహం. అప్పుడే "ఫాదర్ అఫ్ ది ఇయర్" గా ఫాదర్స్ డే కౌన్సిల్ కూడా గుర్తించింది.

"తెలుగు వాణి" కి వీరితో ముచ్చటించే సదవకాశం లభించింది. "మా తల్లిదండ్రులిచ్చిన సలహాలు, భార్య ఇచ్చిన సహకారం వృత్తి, జీవిత గమనంలో ఎంతో ఉపయోగపడ్డాయి. తిరుపతి వంటి సాంస్కృతిక కూడలిలో పెరగడం వల్ల చిన్నప్పటినుంచే కళల పైన మక్కువ పెరిగింది" అన్నారు. యువతకు వీరిచ్చే సందేశం: "సాధించాలనే తపన, పట్టుదల, సహనము – ఈ మూడూ గెలుపుకు సూత్రాలు. తపన, పట్టుదల వల్ల మంచి ఫలితాలు సాధించగలరు. ఫలితాలు వెంటనే

రాకపోయినంతమాత్రాన వదలొద్దు – సహనంతో ముందుకు సాగండి”. తమ ఎదుగుదలను గుర్తుచేసుకుంటూ “నా మొదటి సంస్థ టాటాలో పనిచేసేటప్పుడే నా నాయకత్వ లక్షణాలను గుర్తించాను, వెంటనే ఇక్కడి మాడిసన్/విస్కాన్సిన్ విశ్వవిద్యాలయానికి ఎం.బి.ఎ. చెయ్యటానికి రావడం, ఉద్యోగం సంపాదించి అందివచ్చిన అవకాశాలను వెనువెంటనే ఉపయోగించుకుంటూ పెద్ద పదవుల్లోకి చేరగలగటం, అమెరికా ఉక్కు కార్మాగార చరిత్రలో అతి పిన్న వయస్కునిగా ఆర్థికాధికారి బాధ్యతలు చేపట్టడం ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోయాయి. గత ఇరవై సంవత్సరాలుగా ఇంకా అంచెలంచెలుగా ఎదుగుతూ పలు సంస్థల్లో ఉన్నతోద్యోగాలు పొందగలిగాను” అని చెప్పుకొచ్చారు.

=============

## సమాధానాలు

***సామెత పూరించ గలరా*** ***జవాబులు***

1. కంద, కత్తిపీట
2. ఆవు, దూడ
3. భారతం, గారెలే
4. చింత, పులుపు
5. రుచి, నిద్ర
6. యధార్ధ, లోక
7. గుమ్మడి కాయల, భుజాలు
8. గాడిద, గంధప్పొడి

=============

## తెలుగులో రాయటం చాలా సులువు

ఎలాంటి ప్రత్యేక వనరులూ అవసరం లేదు. మీరు జీ మెయిల్ వాడుతున్నట్టయితే అందులోనే ‘అ’ అన్న చిత్రం పైన నొక్కి తెలుగు మాటలను ఆంగ్లంలో రాయండి. అంతే, ప్రతి పదం ‘ఖాళీ’ నొక్కిన తర్వాత దానంతట అదే తెలుగులోకి మారుతుంది. ఒకవేళ అక్షరానువాదం సరిగ్గా జరగక పోతే ‘వెనక్కి’ నొక్కండి, అది మీకు వేర్వేరు పదాలను చూపుతుంది. మన తెలుగులోనే వుత్తరాలు రాసుకుందుకు ఇదొక సులువైన పద్ధతి.

మరిన్ని సేవలు కావాలా? ఈ పుటను చూడండి: http://www.google.com/transliterate/telugu. పై సదుపాయాలతో పాటు ఆంగ్ల-తెలుగు, తెలుగు-ఆంగ్ల నిఘంటువులు అక్కడే వుంటాయి. మీకు కావలసిన అక్షరాలను మీరే సృష్టించుకోనూవచ్చు – ఒక్క నొక్కుతో! ఈ పుట ఒక సంపూర్ణ పదప్రవర్తకంగా (ఉ|| మైక్రోసాఫ్ట్ వర్డ్) ఉపయోగపడుతుంది కూడా.

---

ఈ సేవలు చాలవంటారా? పైన చెప్పిన వసతులన్నీ రోజువారీ 'ఆఫీస్' లో భాగమైతే బావుణ్ణు అనుకుంటున్నారా? దానికీ పరిష్కారం వుందండోయ్! గూగుల్ ఐ.ఎం.ఇ. (ట్రాన్స్లిటరేషన్ ఇన్పుట్ మెథడ్ - http://www.google.com/ime/transliteration/) కార్యకమాన్ని పరిశీలించండి. ఈ కార్యక్రమంతో ఏ ఆఫీస్ కార్యక్రమంలోనైనా, లేక ఏ అక్షర సంకలన వ్యవస్థలోనైనా (ఉ|| నోట్ పాడ్) వుంటూ సులువైన మీటల సంయోజన (ఉ|| కంట్రోల్ + 'ం', మీరే సంయోజనాల్ని నిర్వచించవచ్చు కూడా) ద్వారా పై చెప్పిన అన్ని వసతులూ పొందవచ్చు. అనట్టు, లేఖిని (http://lekhini.org/) కూడా మరొక ప్రత్యామ్నాయం.

'వీటితో తెలుగులో అయితే రాయగలము, కాని మాదగ్గిర నిఘంటువులు లేవు, పదాల కోసం కష్టపడుతున్నాము' అంటారా? అయితే మీరు చెయ్యవలసినదంతా మీ పదం కోసం గూగుల్ చెయ్యటమే. పదం పక్కన 'తెలుగు టు ఇంగ్లీష్' అని ఆదేశించండి, చాలు – మీకెన్నో పుటలు అంతర్జాలంలో దర్శనమిస్తాయి.

నమ్మలేక పోతున్నారా? తెలుగులో రాయటం నిజ్జంగా సులువండీ! ఈ మొత్తం వ్యాసాన్ని గూగుల్ ఐ.ఎం.ఇ. ఉపయోగించి ౧౨ నిముషాలలో తాయారుచేసాము. ఇంకెందుకు ఆలస్యం, మన తెలుగులోనే గర్వంగా రాసుకుందాం పదండి ...

*"తెలుగదేలయన్న దేశంబు తెలుగేను*
*తెలుగు వల్లభుండ తెలుగునొకండ*
*ఎల్ల నృపులు గొల్వ నెరుగవే బాసాడి*
*దేశభాషలందు తెలుగు లెస్స"*

అన్న రాయల వారి మాటలు నిరూపిద్దాం రారండి...

=============

మీ సలహాలు, సూచనలు, సందేహాలు ... సుస్వాగతం.

"తెలుగు వాణి" సంపాదక వర్గాన్ని ఎప్పుడైనా సంప్రదించండి:

literary@californiatelugu.org

Telugu Vaani, 115 Austin Dr Folsom CA 95630

DISCOVER

# Success

*AlphaGraphics can assist you with building your business, increasing your revenue and representing your brand with confidence by developing and producing everything you need to succeed!*

**Usha Datla**
**udatla@alphagraphics.com**

- Annual Reports
- Blueprints
- Brochures
- Business Cards
- CD/DVD Replication
- Cards & Invitations
- Corporate/Brand Identity
- Design Services
- Dimensional Mail Campaigns
- Direct Mailing Campaigns
- Email Campaigns
- ePublishing
- Forms & Labels
- Letterhead, Stationery & Envelopes
- Mobile Apps & Websites
- Newsletters & Flyers
- Pay-per-click
- Photo Prints & Photobooks
- Posters, Signs & Banners
- Personalized Landing Pages (PURLS)
- Promotional Products
- QR Codes
- Social Media
- Trade Show & Presentation Materials
- Variable Mapping
- Web Design & Search Engine Optimization
- Yearbooks, Manuals & Book Printing




3068 Sunrise Blvd. Suite F • Rancho Cordova, CA 95742 • Phone 916.221.4333 • Fax 916.221.4334 • www.agranchocordova.com